ప్రజాశక్తి
శుక్రవారం 15 నవంబర్ 2024





యల్లనూరులో వర్షానికి తడిసిన ఆరబోసిన వరిధాన్యం

నూర్పిడి సమయంలో వానలు

'అనంత'లో పలుచోట్ల వర్షం - పుట్లూరులో నేలకొరిగిన పంటలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో పలుచోట్ల గురువారం నాడు వర్షం పడింది. మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడ్డాయి. అనంతపురం జిల్లాలో 31 మండలాలుంటే 18 మండలాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం పడింది. ఇందులో అత్యధికంగా పుట్లూరు మండలంలో 27.2మిల్లీమీటర్లు నమోదవగా, యల్లనూరులో 24.8, అనంతపురం నగరంలో 23.2, బుక్కరాయసముద్రంలో 18.2 మిల్లీమీటర్లు నమోదయింది. తక్కిన మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా చూసినప్పుడు సగటున 6.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది.

నూర్పిడి సమయంలో వానలతో ఇక్కట్లు

ఖరీఫ్ పంటలు నూర్పిడికి వచ్చిన సమయంలో నవంబర్‌లో వస్తున్న ఈ వర్షాలతో రైతులకు ఇక్కట్లు నెలకొన్నాయి. ప్రధానంగా వరి పంటలు కోత దశకు వచ్చాయి. కొన్నిచోట్ల కోతలు పూర్తయ్యి ధాన్యం అరబోసుకున్నారు. ఉన్నఫలంగా వర్షం వస్తుండటంతో ఆరబోసిన ధాన్యన్ని రక్షించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడ్డాయి. ఒక మోస్తరు వర్షపాతం నమోదయిన పుట్లూరు, యల్లనూరు మండలాల్లో గాలులు కూడా వీయంతో మొక్కజొన్న, అరటి, బొప్పాయి పంటలు నేలకొరిగి దెబ్బతిన్నాయి. తక్కిన చోట్ల కూడా వర్షం ప్రభావం పంటలపై ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రధానంగా కంది పంట పూతదశలోనూ, కాయదశలో ఉంది. ఈ సమయంలో వర్షాలొస్తే తెగుళ్లు వ్యాపించే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెలలో ఇదే అత్యధికంగా

నవంబరు మాసంలో అనంతపురం జిల్లాలో వర్షాలు రావడం చాలా వరకు తక్కువనే చెప్పాలి. బుధవారం వరకు కూడా వర్షాలు తక్కువగానే నమోదయ్యాయి. సాధారణ వర్షపాతం 16 మిల్లీమీటర్లు అయితే రెండు మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యింది. గురువారం ఒక్క రోజే 6.4 మిల్లీమీటర్లు నమోదయింది. మొత్తం సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు చూస్తే జిల్లాలో ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయింది. జూన్ నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 437.1 మిల్లీమీటర్లు అయితే 568.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. సాధారణం కంటే 30 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. గతేడాది ఇదే సమయానికి 400 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయ్యింది. ఈసారి మాత్రం అగస్టు, అక్టోబరు మాసాల్లో మంచి వర్షాలు పడ్డాయి.



పుట్లూరు మండలం చింతకుంటలో నేలకొరిగిన మొక్కజొన్న పంట



పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు



కదిరిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

సమస్యలపై

సిపిఎం ప్రజాపోరు

ప్రజా సమస్యల పరిష్కారంపై జిల్లా వ్యాప్తంగా ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాల వద్ద సిపిఎం నిర్వహించిన ప్రజాపోరు ఆందోళనలు విజయవంతం అయ్యాయి. ఈ నెల 8వ తేదీ నుంచి సిపిఎం ప్రజాపోరు పేరుతో జిల్లాలో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలని, మహిళలు, చిన్నారులపై దాడులు, అత్యాచారాలు నియంత్రించాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలనే తదితర డిమాండ్లతో ప్రజాపోరు కొనసాగింది. ఇందులో భాగంగా గురువారం నాడు ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నాయకులు ఎండగట్టారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, కార్మికులు, రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

- ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు, కార్మికులు, రైతులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక పాలనపై ఆగ్రహం
- జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు విజయవంతం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు ఆందోళన చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట బైటాయించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈఎస్.వెంకటేష్ పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా చిరు ఉద్యోగులపై రాజకీయ వేధింపులు, ఒత్తిళ్లు అధికం అయ్యాయన్నారు. వీటిని నియంత్రించాల్సిన బాధ్యత కూటి ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కొత్తచెరువు, పుట్టపర్తి, జగనన్న లేఅవుట్లలో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. జగరాజుపల్లి బీసీ కాలనీలో రోడ్ల నిర్మాణం, కర్నాటక నాగేపల్లి, శ్మశాన వాటిక సమస్యలను తీర్చాలన్నారు. ఇక కేంద్రంలో ఎన్‌డిఎ పరిపాలనతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. మహిళలు, బాలికలు, దళితుల మీద దాడులు, అత్యాచారాలు పెరిగాయన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. వీటని పక్కదారి పట్టించడానికి బిజెపి ప్రభుత్వం జమిలి ఎన్నికల పేరుతో కొత్త డ్రామాకు తెరదీస్తోందన్నారు. రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలాగే ట్రు అప్ పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం వేసిందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్, పట్టణ కార్యదర్శి బ్యాళ్ల అంజి, కొత్తచెరువు మండలం సిపిఎం కార్యదర్శి ముత్యాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పవన్ కుమార్, ఆఫీస్ బేరర్ సిద్దు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నిరసనలు 6లో

బాలల దినోత్సవం రోజునా చిన్నారుల పస్తులు

ఎంజిఎం పాఠశాలలో ఉడికీఉడకని అన్నం చేసిన భోజనాన్ని పారేసిన ఏజెన్సీ నిర్వాహకులు



ఉడకని అన్నాన్ని పారబోయడానికి తరలిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

ప్రజాశక్తి-హిందూపురం

చిన్నారులకు పౌష్టిక ఆహారాన్ని అందించి.... వారి ఎదుగుదల కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. అయితే బాలల దినోత్సవం రోజే పట్టణంలోని ఎం జి ఎం పాఠశాలలో ఉడికి ఉడకని మధ్యాహ్న భోజనాన్ని తినలేక విద్యార్థులు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో గతంలో ఉన్న మధ్యాహ్న భోజన ఏజెన్సీని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మార్చి అధికార పార్టీ నేతలకు కట్టబెట్టారు. ప్రతిరోజు సుమారు 600 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేసి అందించాల్సి ఉంది. ప్రతిరోజు సుమారు 50 కేజీల బియ్యాన్ని వండాల్సి ఉన్నప్పటికీ కనీసం 15 కేజీల బియ్యాన్ని సైతం వండడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వండే కాస్తో కూస్తో బియ్యాన్ని సైతం సరిగా వండడం లేదన్న విమర్శలు ఉన్నాయి. బాలల దినోత్సవం రోజు పాఠశాలల్లో మరింత నాణ్యతగా వండాల్సిన భోజన ఏజెన్సీ నిర్వాహకులు తమ నిర్లక్ష్యాన్ని వీడలేదు. దీంతో ఉడికి ఉడకని అన్నాన్ని విద్యార్థులు తినలేక పారేశారు. మిగిలిన అన్నాన్ని భోజన ఏజెన్సీ నిర్వాహకులు పశువుల కోసం తరలించినట్లు తెలుసోంది. ఏజెన్సీ నిర్వాహకులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో అధికారులు వారిపై కనీస చర్యలు సైతం తీసుకోవడం లేదు. బాలల దినోత్సవం రోజే ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యంను వివరణ కోరగా బాలల దినోత్సవం కావడంతో విద్యార్థులు ఎవరూ తినకపోవడం వల్ల మిగిలిన అన్నాన్ని ఏజెన్సీ నిర్వాహకులు బయటకు తరలించారన్నారు. దీన్ని బట్టి చూస్తే ఈ విషయంలో స్థానిక అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోరన్నది తేట తెల్లమయింది. కనీసం జిల్లా కలెక్టర్ అయినా ప్రత్యేక అధికారులతో విచారణ జరిపించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన భోజన ఏజెన్సీని తొలగించడంతో పాటు పాఠశాల హెచ్ఎం పై చర్యలు తీసుకుని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందే విధంగా చూడాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఇళ్ల స్థలాల అక్రమాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కొత్తచెరువు

గత వైసిపి ప్రభుత్వంలో కొత్త చెరువులోని మూడు లేఅవుట్ లో వెయ్యి మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారని అందులో నెలకొన్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నీలకంఠారెడ్డికి సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఈ లేవుట్లలో అంగనవాడీకేంద్రాలకు, గుడికి, బడికి స్థలాలను ఖాళీగా ఉంచారని అయితే వీటిని కూడా కొందరు ఆక్రమించుకుంటున్నారని విమర్శించారు. వీరికి కొందరు రెవిన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నందునే ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు, ప్రాంతీయ కార్యదర్శి బాళ్ళఅంజి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పవన్, నాయకులు నాగరాజు, పెద్దన్న, శంకర్ రెడ్డి, కేశవ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు న్యాయం చేయండి

ఎంపిడిఒ కార్యాలయం ముట్టడిలో సిపిఎం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలో 25 సంవత్సరాలుగా పంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న తమ సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు కోరారు. ఈ మేరకు వారు సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవో కార్యాలయాన్నిముట్టడించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016 నుండి పంచాయతీ కార్మికులకు ఆర్డర్ కాపీ లేదన్నారు. మండల కేంద్రానికి ఎంతో మంది ఎంపీడీవోలు అధికారులు, నాయకులు, వస్తున్నారు పోతున్నారే కాని పంచాయతీ కార్మికుల సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇప్పుడైనా తమను పంచాయతీ కార్మికులను గుర్తించి ఆర్డర్ కాపీ మంజూరు చేయాలని కోరారు.

బుక్కపట్నం చెరువు ముంపు రైతులను ఆదుకోండి

అసెంబ్లీలో ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బుక్కపట్నం

రాష్ట్రంలో అతిపెద్ద చెరువుల్లో రెండవ చెరువుగా ప్రసిద్ధిగాంచిన బుక్కపట్నం చెరువు కింద నీటి ఆధారంగా జీవనం సాగిస్తున్న రైతులను, హంద్రీనీవా ద్వారా వచ్చే నీటి ముంపునకు గురైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యమంత్రిని కోరారు. అమరావతి లో బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోని జీరో అవర్‌లో పుట్టపర్తి ఎమ్మెల్యే మాట్లాడారు. బుక్కపట్నం చెరువు నీటి ముంపు బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పరిహారం చెల్లించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే విన్నవించారు. ప్రస్తుతం ఈ చెరువు నిండితే ముంపు రైతాంగానికి ఎలాంటి ఆధారంఉండదని అలాంటి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. జిల్లా అధికారుల నుంచి తగిన నివేదికలు తెప్పించుకొని సకాలంలో బాధిత రైతులకు పరిహారం అందేలా చూస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి హామీ ఇచ్చారు.

పుట్టపర్తి అర్బన్ : పేదలకు ఇస్తున్న రూ. 3వేల పించన్లను 4వేల రూపాయలకు పెంచడం చారిత్రాత్మకమని దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో అమలు చేయడం పట్ల ప్రభుత్వాన్ని అభినందిస్తున్నామని శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి న్నారు. గురువారం శాసనసభ సమావేశంలో పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుపుకున్నారన్నారు. ప్రతి నెల ఒకటవ తారీఖున సుమారు 65 లక్షల కుటుంబాలకు పింఛను లబ్ది కలుగుతోందన్నారు. వికలాంగులు సదరం క్యాంపుకు వెళ్లి సర్టిఫికెట్ తీసుకురావాలంటే ఇబ్బందులు పడుతున్నారని, ఆయా నియోజకవర్గంలో ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కరించాలని సింధూర రెడ్డి శాసనసభలో కోరారు.



అసెంబ్లీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర



నిరసన ర్యాలీలో పాల్గొన్న సిపిఎం నాయకులు



బాలయ్య ఇంటి ముందు ఆందోళన చేస్తున్న పేదలు

బాలయ్యా.. పేదల ఆక్రందన కనిపించలేదా..!

- సినిమా డైలాగులు కాదు ఆచరించండి
- 'పురం'లో పేదల గుడిసెల తొలగింపు దుర్మార్గం
- నిరసన ర్యాలీలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-హిందూపురం

'ఏళ్ల తరబడి సొంతిళ్లు లేక ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదల నివాసాలను పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్రమంగా కూల్చి వేశారు. గత ఐదు రోజులుగా పేదలు రోడ్డున పడ్డారు. 440 కుటుంబాలు నిలువనీడలేక వీధిన పడ్డాయి. ఇంత జరుగుతున్నా వీరి ఆక్రందనలు కన్పించడం లేదా.' అంటూ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను సిపిఎం నాయకులు ప్రశ్నించారు. కొల్లకుంట సమీపంలో సుమారు 8.5 ఎకరాల భూమిలో గత తొమ్మిది నెలల క్రితం సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటం చేసి 446 నిరుపేద కుటుంబాలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఐదు రోజుల క్రితం అర్ధరాత్రి కూల్చివేశారు. దీనికి నిరసనగా గత 5 రోజుల నుంచి తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బాధితులు ఆందోళన చేస్తున్నారు. ఇందులో భాగంగా పేదలకు న్యాయం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నాడు నిర్వాసితులు తహశీల్దార్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకోవాడానికి యత్నంచారు. మహిళలు ప్రతిఘటిస్తూ ఎమ్మెల్యే ఇంటి వరకు ర్యాలీ కొనసాగించారు. ఆయన నివాసం ముందు బైటాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ బాలయ్య ఇలాఖాలో పోలీసులు, రెవెన్యూ అధికారులు చట్టాన్ని ఉల్లఘించి నిరు పేదలు వేసుకున్న గుడిసెలను అర్ధరాత్రి సమయంలో కూల్చివేశారన్నారు. హిందూపురం మండల పరిధిలో 446 కుటుంబాలను నిర్వాసితులను చేసి ఆరు రోజులు అవుతున్నా ఈ విషయంపై ఎందుకు నోరు విప్పడం లేదని బాలయ్యను ప్రశ్నించారు. బాలకృష్ణ నియోజక పర్యటన సమయంలో మహిళలకు కష్టం వస్తే అర నిమిషంలో వస్తానంటూ సినిమా డైలాగులు చెబుతంటారని, అలాంటి వ్యక్తి ఆయన నియోజకవర్గంలో పేదలు నిలువనీడ కోల్పోయి రోడ్డున పడ్డా స్పందించకపోవడం విచారకరం అన్నారు. గత పదేళ్ల బాలయ్య పాలనలో ఎంత మంది పేదలకు సొంత ఇళ్లను నిర్మించి ఇచ్చారో చెప్పాలన్నారు. పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చి నిరాశ్రయిలను చేశారు. అర్ధ రాత్రి మహిళలు సామగ్రి, నిత్యావసర సరుకులు బయటకు తీసుకుంటామని పోలీసుల కాళ్లు పట్టుకున్నా కనికరించకుండా ఈడ్చిపారేశారన్నారు. అడ్డు వచ్చిన వారిని అరెస్టు చేసి బలవంతంగా వివిధ స్టేషన్‌లకు తరలించారన్నారు. అధికారుల దమనకాండలో దాదాపు పేదలు రూ.1.50కోట్లు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూపురం కేంద్రంగా ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే బాలకృష్ణ, ఆయన ముగ్గురు పిఎలు ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. పేదలు శాంతియుతంగా నిరసన ర్యాలీ చేస్తున్నా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందంటే పురంలో ప్రజాస్వామ్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. ఇప్పటికైన బాలకృష్ణ స్పందించి పేదలు వేసుకున్న స్థలంలో వారికి పట్టాలు ఇచ్చి గృహాలు నిర్మించడంతో పాటు తొలగింపు సందర్భంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పేదలపై అక్రమంగా కేసు పెట్టిన విఆర్ఒ, తహశీల్దార్‌లను సస్పెండ్ చేయాలన్నారు. నివాసాలను నేలమట్టం చేసిన పోలీసులపైనా శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బాలయ్య నివాసంలో టిడిపి నాయకులు జయప్పకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, సిఐటియు నాయకులు రాము, పరిగి సిపిఎం నాయకులు కిరణ్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు జ్యోతమ్మ, నసీం తాజ్, సరస్వతి, సుమేరా, రాయుడు, రామాంజి, నరసింహ, ఆచారి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చాలి

ప్రజాశక్తి-హిందూపురం

మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలని సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కోరారు. సిఐటియు అనుబంధంగా ఉన్న అంగన్వాడి యూనియన్ ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాళ్లు మాట్లాడుతూ మినీ వర్కర్లకు పదోన్నతులు కల్పించాలన్న నిబంధనలు ఉన్నా సక్రమంగా అమలు చేయడం లేదని వాపోయారు. అత్యవసర సమయాల్లో, వేసవిలో మినీ వర్కర్లకు ఎలాంటి సెలవులు మంజూరు చేయడం లేదన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించేందుకు గతంలో 42 రోజులపాటు సమ్మె చేసిన సందర్భంగా హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా మార్చుతూ ఉత్తర్వులు ఇవ్వాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు పెంచడంతోపాటు వేసవి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిడిపిఒ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు లావణ్య, శిరీష, శైలజ, సిఐటియు నాయకులు రాముతో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్వాడీలు

చేపల చెరువు వేలం

లేపాక్షి : మండల పరిధిలోని మైదుగోళం చెరువులో చేపల పెంపకానికి గురువారం వేలంపాటను నిర్వహించారు. రహమాతుల్లా అనే గుత్తేదారుడు 51వేల రూపాయలకు చెరువును దక్కించుకున్నట్లు కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఈవోఆర్డీ ఆనంద్ కుమార్, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రొద్దం: మండలంలోని రాగిమేకలపల్లి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. మండలంలోని రాగిమేకలపల్లి, కంబాలపల్లె, బూచర్ల,లోచర్ల, శ్యాపురానికి సరఫరా అయ్యే ఫీడర్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు ఉదయం 9నుంచి సాయంత్రం 4వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదరులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు ప్రణాళిక

బత్తలపల్లి : బత్తలపల్లిలోని దళితవాడలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు అధికారులు, టిడిపి నాయకులు తెలిపారు. గురువారం బత్తలపల్లి ఎస్సీ కాలనీలో ఎంపిడిఒ నరసింహా నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి నెట్టెం రమణ, జక్కంపూడి నాగభూషణ,పంచాయతీ కార్యదర్శులు నారాయణస్వామి,అశోక్ కుమార్ తదితరులు కాలనీలో పర్యటించి నెలకొన్న సమస్యలను కాలనీవాసులతో అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ లైన్లు మార్పిడి, తాగునీటిసమస్య, అస్తవ్యస్తంగా ఉన్న డ్రయినేజీ తదితర సమస్యల పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో టిడిపి నేతలు నాగార్జునరెడ్డి, ముతవల్లి సులేమాన్, గుండుసాబ్, పాముల పెద్దన్న, గంగాధర, పంచాయతీ కార్యదర్శులు నారాయణస్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ముదిగుబ్బ : మండల పరిధిలోని ముక్తాపురం గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ విజయ్‌భాస్కర్ గురువారం తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన, హాజరు నమోదును పరిశీలించారు. సిబ్బందికి అప్పగించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

బుక్కపట్నం : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ లెక్చరర్ గా పనిచేస్తున్న రాజ్ మహమ్మద్ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో రాజ్‌మహమ్మద్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ .శ్రీనివాసులు, అధ్యాపకులు దస్తగిరి, ఓబులేసు, రామాంజి, గంగరాజు, ఓబయ్య, శ్రీరామ్ రెడ్డి, వెంకటేశ్వర ప్రసాదు, హరి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ముందుండాలి

ధర్మవరం రూరల్ : పార్టీ సభ్యత్వ నమోదులో ధర్మవరం నాయకులు ముందుండాలని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్ ఛార్జిలు, ఇతర నాయకులతో శ్రీరామ్ గురువారం సమావేశం నిర్వహించారు. ప్రాంతాల వారిగా సభ్యత్వ నమోదు ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, కమతం కాటమయ్య, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు

ధర్మవరం రూరల్ : ధర్మవరం చెరువు మొదటి మరువ వద్ద ధ్వంసమైన రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు గురువారం మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యాలయ సిబ్బంది, ఆర్ అండ్ బి అధికారులు, మున్సిపల్ అధికారులు ధ్వంసమైన రోడ్డు ప్రాంతాన్ని పరిశీలించారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

గోరంట్ల: పట్టణంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో పిచ్చి మొక్కలను సామాజిక సేవాకర్త టిడిపి యువ నాయకుడు ఉమరాన్ తన సొంత నిధులతో తొలగించారు. జెసిబి ఏర్పాటు చేసి పాఠశాలలో శుభ్రం చేయించారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉమర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మడకశిర : దీర్ఘ కాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం రొళ్ల మండలం రత్నగిరి, ,అలుపునపల్లి ,బీజీహళ్లి రొల్ల, కాకి,టి డి హళ్ళి ప్రాథమిక,ఉన్నత పాఠశాలలు పాఠశాలలో సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ నాయుడు, గోపాల్ నాయక్, ఆదినారాయణ, ఉదయ్ కుమార్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నల్లచెరువు నాయకులు



తనకల్లులో ధర్నాలో పాల్గొన్న నాయకులు

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

ప్రజాపోరులో సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - కదిరి అర్బన్

నిత్యావసర వస్తువులు, సరుకుల ధరలు తగ్గించాలని, రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించాలని, సిపిఎం నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు అరికట్టాలని, రాష్ట్ర ప్రజలకు ఉచిత ఇసుక అమలు చేయాలని కోరారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలు వ్యతిరేకిస్తున్న చోట్ల నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం షాపులను అనుమతించకూడదన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పజెప్పాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వేగవంతం చేస్తున్న కేంద్రం కుట్రలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిలబడాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా జమిలి ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యం గొంతు నులిమే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్, ముస్తాక్, బాబ్జాన్, రామ్మోహన్, ఆంజనేయులు, కృష్ణానాయక్, నారాయణ, ఫాజిల్, జిలాన్, మహబూబ్ బాషా, జయశ్రీ, మున్ని తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు :ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా సిపిఎం మండల కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజా పోరు లో బాగంగా నల్లచెరువు మండల కేంద్రములో డిప్యూటీ తహశీల్దార్ రవి కుమార్‌కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, వెంకట స్వామి, సదాశివ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తన నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వివి. రమణ, సిపిఎం నాయకులు శివన్న,ఎస్వీ రమణ, సిఐటియు వేమన్న, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఆర్డీవో

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్యార్థులు చిన్నతనం నుండి ఒక నిర్దేశమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని నిరంతరం చదువుతూ ఉండాలని అదేవిధంగా వ్యక్తిత్వంలో మంచి మార్గంలో నడవడానికి ప్రయత్నించాలని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె గురువారం పుట్టపర్తి మండల పరిధిలోని బీడుపల్లి ఉన్నత పాఠశాలలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ లో అంతర్భాగమైన జిల్లా బాలల పరిరక్షణ సమితి చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రవర్తన నియమావళి నడవడిక రావడానికి ఉపాధ్యాయులు ప్రముఖ భూమిక పోషిస్తారని తెలిపారు. అనంతరం డిఇఒ కిష్టప్ప మాట్లాడుతూ బాల బాలికలు పట్టుదలతో మంచి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం బాలల హక్కుల వారోత్సవాల గోడ ప్రతులను ఆర్డీవో చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిసిపిఒ మహేష్, పుట్టపర్తి అర్బన్ సిఐ ఇందిరా, డివైఇఒ రంగస్వామి, ఎంఇఒలు పోలే ప్రసాద్, ఖాదర్ వలీ, అధికారులు నాగలక్ష్మి, మురళీధర్, కొండప్ప, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు



మడకశిర గ్రామసభలో వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తుడు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కొత్తచెరువు తహశీల్దార్

ప్రజాశక్తి - లేపాక్షి

మండలం పరిధిలోని కంచిసముద్రంలో గురువారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, మండల సర్వేయర్ సుమిత్ర, ఆర్ఐ ప్రమీల మ్మ, టీడీపీ నాయకులు శ్రీ రామ్ రెడ్డి, రవి, శనివారమయ్య, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : గ్రామీణ ప్రాంతాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు సి ఎస్‌డిటి లక్ష్మీనరసింహ తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఆర్ అనంతపురంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నామని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ నీలకంఠారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కేసాపురం గ్రామంలో సర్పంచి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సురేష్ వీఆర్వో లు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ శభాష్ ట్రియన్ తెలిపారు కొత్త చెరువులోనే బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నెహ్రూ జయంతిలో పాల్గొన్న ఆయన నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థినులకు జీరో అకౌంట్ ఓపెన్ చేసి వారికి పుస్తకాలను పెన్నులు స్వీట్లని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ జ్యోతి, బిజినెస్ కరస్పాండెంట్ నాగేంద్ర, హెచ్ఎం నూర్జహాన్, ఉపాధ్యాయురాలు నాగరత్నమ్మ, అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలోని మల్లాపల్లి జగనన్న లేఅవుట్‌లోని సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత డిమాండ్ చేశారు. మేరకు ఆమె గురువారం మల్లాపల్లి జగనన్న కాలనీలో పర్యటించారు. అక్కడున్న సమస్యలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.కాలనీలో రెండు సంవత్సరాల నుండి లోవోల్టేజీ సమస్య ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అహుడా ఛైర్మన్‌కు అభినందనలు

ప్రజాశక్తి-పెనుకొండ

అహుడా ఛైర్మన్ గా నియమితులై జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్‌కు పెనుకొండ జనసేన నాయకులు అభినందనలు తెలిపారు. అహుడా ఛైర్మన్ గా ఎన్నికై మొదటిసారిగా జిల్లాకు వచ్చిన సందర్భంగా జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులు గుత్తి దగ్గర ఘన స్వాగతం పలికారు. పెనుకొండ జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు లోకేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జనసేన నాయకులు, వీరమహిళలు ఈ కార్యక్రమానికి తరలి వెళ్లారు. అహుడా ఛైర్మన్ టిసి వరుణ్‌కు లోకేష్ పుష్ప గుచ్చం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేంద్ర, రమేష్, ప్రసాద్, బాబా ఫక్రుద్దీన్, వీర మహిళ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిన్న పిల్లలపై, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ క్రైమ్, గంజాయి గురించి దాని వల్ల కలిగే నష్టాలు, రోడ్ సేఫ్టీ, డయల్ 100 వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సిఐ రాఘవన్, పెనుకొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



కొత్తచెరువులోని గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు



కదిరిలో గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - పెనుకొండ

పట్టణంలోని శాఖా గ్రంథాలయములో 57వ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె. మహబూబ్ బాషా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మెహబూబ్ భాష ఆధ్వర్యంలో 57వ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బాలల దినోత్సవం పురస్కరించుకొని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీబాయి, ఉపాధ్యాయులు జవ్వాజి నాగరాజు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల కేంద్రం లోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రాంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా నెహ్రు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రాంథాలయ అధికారి జయసింహ రాజు, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

కొత్తచెరువు : గ్రంథాలయాలను విద్యార్థులు పాఠకులు నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి హెచ్ఎం మనోహర్ తెలిపారు. కొత్త చెరువులోని శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ప్రారంభించారు బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటరమణ, ఉపాధ్యాయులు అరుణ, రిటైర్డ్ ఎంపీడీవో మహమ్మద్, పాఠకులు రామాచారి, రాఘవ, స్వీపర్ వలి, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా నెహ్రూ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని పర్వీను, ఉపాధ్యాయుడు రాజశేఖర్, సర్పంచి రహమతుల్లా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

తనకల్లు : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి ఎస్. మస్తాన్‌వలి, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : శాఖా గ్రంథాలయంలో బాలల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి, పాఠకులు, విద్యార్థులు, సిబ్బంది చాంద్ భాష తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

దాడి ఘటనలో కేసు నమోదు

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని బూదిలి వాండ్లపల్లికి చెందిన రంగప్ప అనే టిడిపి కార్యకర్తపై వైసిపికి చెందిన ముగ్గురు దాడి చేశారన్న ఫిర్యాదుతో కేసు నమోదయింది. వానవోలు పంచాయతీ ఉపసర్పంచ్ బుల్లెట్ బాబు, ఉగ్రంపల్లి చెందిన శ్రీనివాసులు, మరో వ్యక్తికలిసి ఈ నెల 9న బూదిలివాండ్లపల్లిలో తన ఇంటి లోకి చొరబడి టీవీ, ఫ్రిడ్జ్ ధ్వంసం చేసి దాడి చేశారని బాధితుడు రంగప్ప పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని బంగారు వాండ్లపల్లి గ్రామ శివారులలో పేకాట ఆడుతున్నట్లు వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.తమకు అందించిన సమాచారం దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

'పోసాని' పై ఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

టీటీడీ బోర్డు ఛైర్మన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు పోసానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీకి తెలుగుదేశం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు గురువారం సత్యసాయి జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బేకరీ నాయుడు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, సుబ్రమణ్యం, కుళ్లాయప్ప, రమణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్ల తనిఖీ

కాలం చెల్లిన వస్తువులు సీజ్

ప్రజాశక్తి- పెనుకొండ

పెనుగొండ పట్టణ సమీపంలో ఉన్న క్యాంటీన్లను ఫుడ్ ఇన్స్‌పెక్టర్ తస్లీమ్ గురువారం తనిఖీ చేశారు. 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న డాన్స్ క్యాటరింగ్ క్యాంటీన్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు.కియా అనుబంధ సంస్థలకు ఈ క్యాంటీన్ నుంచి ఆహారం సరఫరా అవుతుంది. ఈసందర్భంగా అధికారులు క్యాంటీన్లో వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం స్టోర్లో ఉన్న పలు రకాల నిత్యావసర వస్తువులను పరిశీలించారు. కొన్ని వస్తువులు కాలం చెల్లి ఉండడాన్ని గుర్తించారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అనంతరం ఫుడ్ ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ క్యాంటీన్లో కాలం చెల్లిన నిత్యావసర వస్తువులను గుర్తించామన్నారు. వాటిని హైదరాబాదు ల్యాబ్‌కు పరీక్షలు నిమిత్తం పంపుతామని అక్కడ రిపోర్టులు ఆధారంగా క్యాంటీన్ పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పలు రకాల భద్రత శుభ్రత పరిణామాలు పాటించాలని క్యాంటీన్ యజమానులకు సూచించామన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

పుట్టపర్తి రూరల్ : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో మతి చెందిన ఎస్ ఆంజనేయులు కుటుంబానికి రూ. 4.32 లక్షల విలువైన చెక్కును జిల్లా పోలీస్ కార్యాలయంలో మృతుడి భార్య జయలక్ష్మికి గురువారం అందజేశారు .ఈ సొమ్మును కుటుంబ అవసరాల కోసం వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వలి, ఆర్ ఎస్ఐలు ప్రదీప్ సింగ్, వెంకటేశ్వర్లు ఏఆర్ ఎస్ఐలు షౌకత్ అలీ, షామీర్ పాల్గొన్నారు.

కదిరి నుంచి అరుణాచలానికి రెండు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆర్టీసీ డీఎం మైనుద్దీన్ అన్నారు. ఈ మేరకు ఆయన భక్తుల సౌకర్యార్థం అరుణచలానికి రెండు ప్రత్యేక బస్సు సర్వీసులను గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల ఆయకట్టుదారుల జాబితా విడుదల

ప్రజాశక్తి - మడకశిర

రొళ్ల మండల పరిధిలోని ఐదు గ్రామాలలోని చెరువుల ఆయకట్టుదారుల జాబితా విడుదల చేసినట్లు తహశీల్దార్ షేక్షావలి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు రొళ్ల మండలంలోని 5 చెరువు నీటి సంఘాలకు సంబంధించిన ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనేపథ్యంలో ఆయాగ్రామాల చెరువులకు సంబంధించిన ఆయకట్టు దారుల జాబితాను ఆయా గ్రామసచివాలయాల్లో ప్రదర్శించినట్లు చెప్పారు. ఇందులో ఎలాంటి అభ్యంతరాలు ఉన్న తహశీల్దార్ కార్యాలయంలో తెలియజేయాలని చెప్పారు.

జై సీతారామ్ శతజయంతి

ప్రజాశక్తి - రొద్దం

తెలుగు సాహితీ శిఖరం కవికాకి కోగిర జై సీతారామ్ జయంతిని మండలంలోని స్థానిక కోగిర ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించారు. కవికాకికోగిర జైసీతారామ్ సేవాట్రస్ట్ అధ్యక్షులు కోగిర జయచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కవికాకి కోగిర జైసీతారామ్ శత జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రజాకవి ఏలూరి యంగన్న, సత్యసాయి జిరసం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, కోనాపురం ఈశ్వరయ్య, పెనుకొండ మాజీ సర్పంచ్ కె.శ్రీనివాసులు,ప్రముఖ కథా రచయిత సడ్లపల్లె చిదంబర రెడ్డి,సిరికల్చర్ డిపార్ట్ మెంట్ కె.నాగార్జున, పెనుకొండ త్రిపుర రిసార్ట్స్ అధినేత డాక్టర్ గోపీనాథ్,సాహితీ స్రవంతి హరి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను కోగిర జైసీతారామ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశులు, పోతులయ్య, రమేష్, హసీనా,విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : సిపిఐ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రామచంద్రయ్య పేర్కొన్నారు. గురువారం సాయి ఆరామంలో సిపిఐ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు చంద్రబాబు అర్హులైన పేదలందరికీ గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు రద్దుచేసి ఇచ్చిన హామీ మేరకు స్థలాలు ఇచ్చి నాలుగు లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య, ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మధు, జిల్లా పార్టీ సభ్యులు దాదా పీరా, మహాదేవ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - గుడిబండ

మండల వ్యాప్తంగా బోర్లు బావులు కలిగిన రైతులు రబి 2024-25 సీజన్‌కు సబ్సిడీ వేరుశనగ విత్తనం కోసం ఆయా రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని గుడిబండ మండల వ్యవసాయ అధికారి వీర నరేష్ తెలిపారు. 30 కిలోల బస్తా పూర్తి ధర రూ. 2880 కాగా అందులో 1140 రూపాయలు సబ్సిడీ పోగా మిగిలిన 1740 రూపాయలను రైతులు చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.ఒక రైతుకు కనిష్టంగా 1 బస్తా గరిష్టంగా3 బస్తాల వరకు ఇస్తామన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని తెలుగుదేశం నాయకులు ముమ్మినేని వెంకటరాముడు కోరారు. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసి సమస్యను వివరించానన్నారు. సత్యసాయి జిల్లా మార్పు జరుగుతుందని ప్రజల్లో వదంతులు వ్యాపిస్తున్నాయని వాటిని వమ్ము చేసే విధంగా సత్యసాయి జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలనికోరినట్లు తెలిపారు. అంతేకాక ఈ నెల 23న సత్యసాయి జయంతికి పుట్టపర్తికి రావాలని కోరానని తెలిపారు. ప్రతి ఏడాది సత్య సాయి జయంతి సందర్భంగా నవంబర్ 23న సత్య సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సమీపంలో పలువురు దాతలతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవం



వివిధ వేషధారణలతో 'పాంచజన్య' విద్యార్థులు



బత్తలపల్లిలో బాలల దినోత్సవ వేడుకలు



మడకశిరలో నెహ్రూ చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి- హిందూపురం

భారత తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురష్కరించుకుని గురువారం పట్టణంలోని వివిధ పాఠశాల, కళాశాలల్లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. పాంచజన్య పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల అద్యక్షులు శ్రీనివాసులు, నందకుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.కిరికెర వద్ద ఉన్న ఎల్‌ఆర్‌జి పాఠశాల విద్యాలయంలో నర్సరీ చిన్నారులు వివిధ వేషధారణతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రేటరి బాలసుందరం, హెచ్‌ఎం ప్రసాద్, ఎఓ సంజీవ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గోన్నారు. ఆల్‌ఆమీన్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ రియాజ్, హెచ్‌ఎం న్యామతున్నీసా, వివేకానంద మిలీనియం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ బైసానిరాంప్రసాద్, రినౌల్డ్ ఇంగ్లీష్ మీడియంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల అద్యక్షులు ముస్తఫా అలీఖాన్, హెచ్‌ఎం బీబీ జాన్, మనస్వీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ మల్లికార్జున, హెచ్‌ఎం నాగరత్న పాల్గొన్నారు. బాలయేసులో జరిగిన కార్యక్రమంలో బలరామిరెడ్డి, శారద, ప్రతాప్‌రెడ్డి, సువర్ణభారతి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రన్సిపాల్ నీలకంఠరెడ్డి, అనీల్ కుమార్, దీప్తి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అబ్రహీమ్ కుట్టి అంకుల్, దీపు, లూసి, వేణు విద్యావిహార్‌లో జరిగిన కార్యక్రమంలో అద్యక్షులు వేణుగోపాల్‌లు పాల్గొన్నారు. పాంచజన్య పాశాశాలలో జరిగిన కార్యక్రమంలో సుపరిటెండెంట్ విజయేంద్ర, హెచ్‌ఎం గాయిత్రి, ఎహెచ్‌ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం లో గురువారం నాడు బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరరైన సూపర్ వైజర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మాధవి, భాగ్యమ్మ, పిల్లల తల్లి తండ్రులు, ఆయాలు, పిల్లలు పాల్గొన్నారు.

పెనుకొండ : బాలల దినోత్సవ వేడుకలు ప్రగతి, గ్లోబల్ జెన్ పాఠశాలల్లో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ శ్రీనివాసులు బాలల దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. చిన్నారులు వేషధారణలతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు మంజువాణి, డైరెక్టర్లు సాయిసృజన్, సాయి శ్రీధర్, విద్యార్థులు తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : నేటి బాలలే రేపటి పౌరులు అన్న జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు మరువలేనివని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీరాములు అన్నారు. గురువారం పట్టణంలోని

మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ టీ.ఆనంద్, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ గంగాధర్, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, త్రివేంద్ర ,బాబుల్ రెడ్డి, మాజీ సర్పంచి అశ్వర్థ నారాయణ లక్ష్మీదేవి, షౌకత్, రామాంజనేయులు, సుబ్రహ్మణ్యం, కృష్ణ మూర్తి, పి.శ్రీనివాసులు, అంద్రూస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : దేశ మొట్టమొదటి ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ దేశ అభివృద్ధికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పీసీసీ ఉపాధ్యక్షులు కోట సత్యనారాయణ అన్నారు. కొత్త చెరువులోని నాలుగు రోడ్ల కూడలిలో నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. అనంతరం ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బెల్లం నజీర్, నాయకులు మారాల ఓబులేసు, మోహన్, షామీర్ భాయ్, పఠాన్ గౌస్ ఖాన్, పుట్టపర్తి మండల కన్వీనర్ గంగాద్రి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో గురువారం ప్రిన్సిపాల్ యంయస్. కిరణ్ అధ్యక్షతన బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : బాల్యం దశ తిరిగి రానిదని,బాల్యంలోని మధుర స్మృతులు మరువలేని జ్ఞాపకాలని శ్రీజ్యోతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మిడతల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం బత్తలపల్లిలోని శ్రీజ్యోతి హై స్కూల్ నందు బాలల దినోత్సవ వేడుకలు, నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మిడతల ధర్మతేజ, ఉపాధ్యాయులు కాటమయ్య, శంకరయ్య, నాగ పెద్దిరాజు, వెంకటపతి, రమేష్, అనిల్, పరశురాం మధు, ఉమామహేశ్వరి, లక్ష్మి ధనలక్ష్మి, నాగమణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బత్తలపల్లిలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజున గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈకార్యక్రమంలో విద్యార్థులు చిన్నారులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : స్థానిక వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పిట్టా శివ శంకర్ రెడ్డి, ఎస్ ఐ మల్లికార్జున రెడ్డి, హెచ్‌ఎం గంగాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కొండకమర్ల ప్రాథమిక పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌస్ లాజమ్, నాగరాజు, చంద్రకళ, సిద్దయ్య, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రొద్దం : మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాలలో, గ్రంథాలయంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : మండల పరిధిలోని రేకులకుంట ఉన్నతపాఠశాలలో గురువారం నెహ్రూ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాధవరెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిబండ : మండల పరిధిలోని రాళ్లపల్లి, మైనగానపల్లి,అంగన్వాడి సెంటర్లలో గురువారం నెహ్రూ జయంతిని నిర్వహించారు. సందర్భంగా అంగన్వాడీ వర్కర్లు లక్ష్మీదేవి, నాగరత్నమ్మ,సర్పంచులు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు..ఈ కార్యక్రమంలో రాళ్లపల్లి, శంకరగల్లు సర్పంచులు లక్ష్మీనారాయణప్ప, నరేంద్ర, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చిత్తప్ప, అంగన్వాడీలు లక్ష్మీదేవి,నాగరత్నమ్మ, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు చిన్నారులు పాల్గొన్నారు.

హిందూపురం : రేపటి భవిష్యత్తు బాలల చేతుల్లోనే ఉందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రేమ సదన్ లో జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రేమ సదన్ నిర్వాహకులు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను న్యాయమూర్తి అభినందించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, నవేరా, సంతోషి కుమారి, లోక్ అదాలత్ శారద, ప్రేమ సదన్ ప్రతినిధులు మధుసూదన్ రావు, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : బత్తలపల్లిలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి,పద్మావతి అధ్యక్షతన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించిన పాఠశాల విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : మహనీయులు దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారని వారిని నేటి పిల్లలు ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. గురువారం పట్టణంలోని గ్లోబల్ స్కూల్ లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నెహ్రూ వేషధారణతో పిల్లలు అలరించారు.

గుడిబండ : గుడిబండలోనివర్ష సైనిక్ స్కూల్లో గురువారం ఘనంగా బాలల దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, షబ్బీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

18న జాబ్ మేళా

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 18వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్య మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ హరీష్ బాబు, నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే జాబ్ మేళాలో మూడు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్టు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.14వేల నుండి రూ.25వేల వరకు వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు శ్రీ సత్య సాయి, అనంతపురం, హిందూపురం, బెంగళూరు ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్య అభ్యర్థులు తమ బయో డేటాతో పాటు, ఆధార్ కార్డ్, విద్యార్హత పత్రాలు తీసుకొని ఉదయం 9 గంటలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు

సంక్రమిత , అసంక్రమిత వ్యాధుల పై అవగాహన

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

సంక్రమిత అసంక్రమిత న్యూమోనియా,క్యాన్సర్ వంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సూచించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా పుట్టపర్తి పరిధిలోని బత్తలపల్లి, పెడబల్లి కొట్లపల్లి , నిడిమామిడి గ్రామాల్లో క్యాన్సర్, అసంక్రమిత, సంక్రమిత వ్యాధులు , న్యుమోనియా అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నివారణ సులభతరం అవుతుందని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ ఇంటి వద్దనే వైద్య ఆరోగ్య సిబ్బంది వచ్చి పరీక్షలు చేస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమములో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సూపర్ వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పిలు సత్యమ్మ, రాధ, విజయభాస్కర్, సుస్మిత, అంగనవాడి టీచర్ చెన్నకృష్ణమ్మ , ఆశా కార్యకర్తలు శ్రీదేవి, లక్ష్మిదేవి, లక్ష్మి నరసమ్మ, పద్మావతి, వాణిబాయి పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం జిల్లా వైద్య శాఖ అధికారి మంజువాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఒ మాట్లాడుతూ 18 సంవత్సరాల పైబడి ప్రతి ఒక్కరికి క్యాన్సర్ స్ట్రీమింగ్ టెస్టు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధుర్య, ఈ సర్వే పర్యవేక్షణ అధికారి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

చిన్నారులపై అకృత్యాలను కట్టడి చేద్దాం

డీఎస్పీ శ్రీనివాసులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

చిన్నారులపై అకృత్యాలు జరగకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం బత్తలపల్లిలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో చిల్డ్రన్స్ డే సందర్భంగా ధర్మవరం డీఎస్పీ పోలీస్ సిబ్బంది,మహిళా పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల చిన్నారులపై వివిధ రూపాలలో అకృత్యాలు, దాడులు జరుగుతున్నాయన్నారు. ధర్మవరం డివిజన్ పరిధిలో ఇటువంటి సంఘటనలు రాబోయే రోజులలో ఎక్కడా జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిబ్బందికి వివరించారు. ముఖ్యంగా మహిళా పోలీసులు నియమింపబడిన గ్రామాల నుండి ప్రతి సమాచారాన్ని సేకరించాలని ఆయా గ్రామాల్లో జరిగే చిన్న చిన్న సంఘటనలు కూడా ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించాలని చెప్పారు. బ్యాడ్ టచ్,గుడ్ టచ్ లపై చిన్నారులలో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.